సాక్షి జనగామ

బుధవారం । 1 । అక్టోబర్ । 2025



ఆహారం.. ఆరోగ్యం

పాశ్చాత్య ఆహారపదార్థాల జోలికి వెళ్లకుండా ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లు వంటివాటిని తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని నిపుణులు చెబుతున్నారు. - 10లో▸



గోదావరి కాస్త తగ్గుముఖం..

కాళేశ్వరం వద్ద గోదావరికి సోమవారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయగా.. మంగళవారం వరద ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టింది. - 10లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండగా ఉంటుంది. రాత్రి సమయంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండును.

న్యూస్‌రీల్

నేటి రాత్రి 12గంటల వరకే మాంసం అమ్మకాలు

జనగామ: దసరా పండగ రోజు గాంధీ జయంతి రావడంతో ఈనెల 1న (బుధవారం) రాత్రి 12 గంటల వరకు జిల్లా కేంద్రంలో మాంసం విక్రయాలు జరుగుతాయని ఆరె కటిక సంఘం జనగామ అధ్యక్షుడు కె.హరిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా నిబంధనల ప్రకారం మాంసం దుకాణాలు మూసి ఉంటాయన్నారు. గాంధీ జయంతి రోజు దసరా రావడంతో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, మటన్ షాపు నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దసరా పండుగకు ముందు రోజు అర్ధరాత్రి వరకు మాంసం విక్రయిస్తామన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట

ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్

జనగామ: రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ టి.వేణుమాధవ్ తెలిపారు. మంగళవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. జిల్లాలో ప్రమాదకరంగా ఉన్న 2,083 లూజ్ లైన్లు, 191 వంగిన స్థంభాలు 2,131 మధ్య స్థంభాలను పునరుద్ధరించడం జరిగిందన్నారు. రైతులు విద్యుత్ సమస్యలు ఉత్పన్నమైన సమయంలో టోల్ ఫ్రీ నెంబర్ -1912కు కాల్ చేసి పరిష్కారం పొందవచ్చన్నారు. రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఎస్టిమేట్‌కు సంబంధించిన మెటీరియల్ వివరాలు, స్కెచ్‌లు ఇప్పుడు తెలుగులో అందజేస్తున్నామని, రైతులకు వచ్చే ఎస్ఎంఎస్ లింక్ ద్వారా వీటిని తెలుసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు అమర్చితే మోటార్ల జీవిత కాలం పెరుగుతు ందని, లో వోల్టేజి సమస్యలు తగ్గుతాయని స్పష్టం చేశారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పక్కాగా అమలు చేయాలి



పాలకుర్తి టౌన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ను పక్కాగా అమలు చేయాలని జిల్లా సహకార అధికారి, జెడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.కోదండ రాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమలయ్యేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని అన్నారు. కోడ్‌ను ఉల్లంగిస్తే చర్యలు ఉంటాయన్నారు. సమావేశంలో ఎంపీడీవో రవీందర్, ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, ఎంపీవో వేణుమాధవ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పసునూరి నవీన్, మాచర్ల ఎల్లయ్య, సారయ్య, ఎడవెల్లి సోమయ్య, జీవై సోమయ్య, కత్తి సైదులు తదితరులు పాల్గొన్నారు.

జూడా నాయకుల ఏకగ్రీవ ఎన్నిక

ఎంజీఎం: ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) జాతీయ ప్యానెల్‌లో తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (జూడా) నాయకులు ఘన విజయం సాధించారు. ఫైమా జాతీయ కో–చైర్మన్‌గా డాక్టర్ దుబ్యాల శ్రీనాథ్, జాతీయ కార్యదర్శిగా డాక్టర్ ఇస్సాక్ న్యూటన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి మద్దతు ఇచ్చిన సహచర వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంకన్న(ఫైల్)

పాలకుర్తి టౌన్: పాలకుర్తి–నాంచారిమడూరు ప్రధాన రహదారిపై సిరిసన్నగూడెం శివారులోని కంబాలకుంట బస్‌స్టేజీ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని దర్దేపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి వెంకన్న(35) మోటర్ సైకిల్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు మల్లంపల్లి శివారులోని పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి డీసీఎం వ్యాన్ బలంగా ఢీకొట్టింది. దీంతో మోటర్ సైకిల్‌తో పాటు కిందపడ్డ వెంకన్న తలకు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వెంకన్న భార్య పది రోజుల క్రితం ప్రసవించగా కుమారుడు జన్మించాడు. మృతుడి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపారు.

పసిడి పరుగు

రికార్డు స్థాయిలో పెరిగిన బంగారం, వెండి ధరలు

- సామాన్యులకు ఆర్థిక భారమే
- పెళ్లిళ్లలో తగ్గనున్న ధగధగలు
- వచ్చే రెండు నెలల్లో ఇంకా పెరుగుతాయనే అంచనాలు
- 24 క్యారెట్ల 10 గ్రాముల ధరలు రూ.1,22,100

జనగామ:

బంగారం అంటే కేవలం ఆభరణం మాత్రమే కాదు.. భద్రత, సంపదగా భావిస్తారు భారతీయులు. ధరలు ఎంత పెరిగినా పండుగలు, పెళ్లిళ్లు, శుభకార్యాలు బంగారం లేకుండా జరిగే పరిస్థితి ఉండదు. ఒకప్పుడు తక్కువ ధరల్లో కొనుగోలు చేసిన పసిడి నేడు సామాన్య, పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భారంగా మారింది. భవిష్యత్తులో బంగారం ధరలు పెరిగే అవకాశం ఉండడంతో ఆభరణాల కంటే పె ట్టుబడిగా కొనుగోలు చేసే ధోరణి పెరుగుతోంది. నగల రూపంలో కాకుండా బిస్కెట్స్, బాండ్ల వంటి ఆధునిక పెట్టుబడి మార్గాల వైపు దృష్టి సారిస్తున్నారు. సంప్రదాయాలపై ఉన్న మమకారం ఒకవైపు కొనసాగుతూనే, ఆర్థిక లాభాలను దృష్టిలో ఉంచుకుని కొత్త మార్గాల వైపు వెళ్తున్నారు. భవిష్యత్తులో పసిడి ఒక స్టేటస్ సింబల్ కంటే పెట్టుబడి భద్రతకు భరోసా కల్పించనుండ నడంతో సందేహం లేదు.



బంగారు ఆభరణాలు

రికార్డు స్థాయిలో పెరిగిన ధరలు..


ప్రస్తుతం జనగామ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,22,100ల వద్ద ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,12,300లు పలుకుతోంది. వెండి ధరలు కూడా అంతే వేగంగా పెరిగి కిలోకు రూ.1,50,000లకు చేరుకుంది. గడిచిన ఆరు నెలలతో పోలిస్తే ఇవి దాదాపు 40 శాతం మేర పెరిగినట్లుగా గణాంకాలు చెబుతు న్నాయి. 2024 దసరా సమయంలో 10 గ్రాముల బంగారం ధర రూ.78 వేలు ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.72వేలు మాత్రమే పలికింది. వెండి కిలో రూ.94 వేల వరకు ధర పలుకగా, ఏడాదిలోపే 10 గ్రాముల బం గారం రూ.44వేలు, వెండి కిలో రూ.56 వేల వరకు పెరగడం గమనార్హం.



బంగారం కొనుగోలు వినియోగదారులు

పెళ్లిళ్ల సీజన్.. పేదలు, మధ్యతరగతికి కష్టమే

వచ్చే నెల నుంచి శుభముహూర్తాలు, వివాహాలు, గృహప్రవేశాలు, శారీ ఫంక్షన్లు, పండుగలు వరుసగా ఉండనున్నాయి. అయితే పెరిగిన బంగారం, వెండి ధరలతో కొనుగోలు అందని కలగా మారింది. ఒకప్పుడు 200 గ్రాములు కొనుగోలు చేసే కుటుంబాలు ఇప్పుడు కేవలం 5 నుంచి 6 గ్రాములతో సరిపెట్టుకుంటున్నాయి. దీంతో సామాన్య, పేద, మధ్య తరగతి కుటుంబాలు పెళ్లిళ్లు, వేడుకల్లో తళుక్కుమనే పసిడి మెరుపుల్లేకుండానే జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. వన్ గ్రామ్, డిజైనర్ ఇమిటేషన్ జ్యువెల్లరీల వాడకం రోజురోజుకూ పెరిగిపోతోంది. పెట్టుబడి పరంగా బంగారం ధరలు మేలే అయినా, సాధారణ కుటుంబాలకు మాత్రం ఇది తీరని భారంగా మారింది.



రెండు, మూడు నెలల్లో మరింతగా..

ఆర్థిక నిపుణుల అంచనాల ప్రకారం రాబోయే రెండు మూడు నెలల్లో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, డాలర్ విలువలు, క్రూడ్ ఆయిల్ ధరలు కలసి బంగారం, వెండి ధరలపై ప్రభావితం చూపిస్తాయంటున్నారు. పసిడి వెలుగులు తగ్గిపోతున్న ఈ రోజుల్లో, శుభకార్యాలు ఆర్థిక భారంలేకుండా ఎలా సాగుతాయనేది ప్రజల ముందున్న ప్రధాన ప్రశ్న.

నగలు తక్కువ.. సేవింగ్ ఎక్కువ

బంగారం ధరలు కార్మికుల కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. 10 గ్రాములు రూ.1.22లక్షలు దాటడంతో ఆభరణలు చేయించే వారి సంఖ్య జిల్లాలో 70శాతం మేర తగ్గింది. ఉన్నత వర్గాలు బంగారం బిస్కెట్లు కొనుగోలు చేస్తూ.. ఫ్యూచర్ ఆస్తిగా భావిస్తున్నారు.

ఆందోళన కలిగిస్తోంది..



మా అమ్మాయి పెళ్లి కోసం బంగారం కొనే ఆలోచనలో ఉన్నాం. కానీ ధరలు తగ్గితే కొనాలని వాయిదా వేసుకున్నాం. అయితే ఒక్కసారిగా బంగారం ధరలు పెరగడంతో ఇకపై తగ్గే పరిస్థితి కనిపించట్లేదు.

- చింతకింది ఉమ, గృహిణి, పాలకుర్తి

బంగారం కొనలేము..



ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఒక గ్రాము బంగారం కొనలేము. వారం రోజుల కిందట నా కూతురు వివాహం చేశాను. ఐదు తులాల బంగారం కోసం రూ.5లక్షలు తీసుకుని వెళితే, నాలుగు తులాల మాత్రమే వచ్చింది. మరో 10 గ్రాములు పెండింగ్‌లో ఉంది.

- గంధమాల కిష్టయ్య, బచ్చన్నపేట

తయారీ తగ్గింది..



బంగారం ధరలు విపరీతంగా పెరగడంతో ఆభరణాలు చేయించుకునే వారి సంఖ్య తగ్గింది. గతంలో ప్రతి నెల వంద కుటుంబాలు ఆభరణాలు తయారు చేయించుకుంటే, ప్రస్తుతం పదిమందికి పడిపోయింది. చాలా మంది బంగారం బిస్కెట్లు కొనుగోలు చేసి భద్రపరుచుకుంటున్నారు. దీంతో ఆభరణాల తయారీ కార్మికులకు ఆర్థిక భరోసా దూరమవుతోంది.

- నల్లనాగుల శ్రీనివాస్, జ్యువెల్లరీ వ్యాపారి, జనగామ

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థి



మారపాక గిరీశ్‌వర్ధన్

స్టేషన్‌ఘన్‌పూర్: ఎస్‌జీఎఫ్ అండర్–19 విభాగంలో జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థి మారపాక గిరీశ్‌వర్ధన్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రఘుపతి, పీడీ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు జనగామలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 19 ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్న స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ) చదువుతున్న విద్యార్థి గిరీశ్‌వర్ధన్ ఉత్తమ ప్రతిభతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అక్టోబర్ 5 నుంచి 8వ తేదీ వరకు జమ్ముకశ్మీర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మూడో స్థానం..



అశ్వతేజ్‌రెడ్డి

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన గుంపుల రామ్మోహన్ రెడ్డి–శిరీష కుమారుడు అశ్వతేజ్‌రెడ్డి జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని మూడో స్థానంలో నిలినట్లు జిల్లా అధ్యక్షుడు గాదెపాక అయోధ్య, ప్రధాన కార్యదర్శి నీరటి ప్రభాకర్ తెలిపారు. గ్రామానికి చెందిన అశ్వతేజ్‌రెడ్డి ప్రస్తుతం ఐనవోలు మండల కేంద్రంలోని పాత్‌ఫైండర్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఇటీవల జఫర్‌గఢ్ మండలం కూనూరు గ్రామంలో నిర్వహించిన 44వ సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. అందులో భాగంగా ఈనెల 25 నుంచి 28 వరకు తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్‌లో నిర్వహించిన పోటీల్లో తెలంగాణ టీమ్ నుంచి పాల్గొని మూడో స్థానంలో నిలిచినట్లు కోచ్ ముచ్చ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వర్తించాలి

- ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన ఉండాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పక్కన అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్

జనగామ రూరల్: ఎన్నికల నిర్వహణలో నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారుల పాత్ర కీలకమని, అధికారులు సమన్వయంతో పకడ్బందీగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల విధులు, బాధ్యతలు, నిబంధనలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు వారికి ఇచ్చిన హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా చదివి ప్రతీ అంశంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, నిర్వహణ ప్రక్రియలో ఏమైనా సందేహాలు, అపోహలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి బాధ్యత నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారిదేనని, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, పోలింగ్ సిబ్బంది నియామకం, వారికి పోలింగ్‌కు సంబంధించిన సామగ్రి సమకూర్చడం మొదలగు ప్రతి అంశాలను క్షుణ్ణంగా పర్యవేక్షించాలన్నారు. అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ మాట్లాడుతూ..మ్యాన్ పవర్, బ్యాలట్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, మాడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, బ్యాలెట్ పేపర్ ముద్రణ తదితర ఎన్నికల నిర్వహణ బాధ్యతలను చేపట్టే నోడల్ అధికారులు తమ విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, డిప్యూటీ సీఈవో సరిత, ఎన్నికల నిర్వహణకు వివిధ అంశాలకు కేటాయించిన ఆర్వోలు, ఏఆర్వోలు, మాస్టర్ ట్రైనర్‌లు రామరాజ్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాదాబైనామాలను వేగంగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

బచ్చన్నపేట: భూభారతి చట్టంలో ఆయా గ్రామాల వారీగా వచ్చిన భూ సమస్యలను, సాదాబైనామాలను వేగంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..జీపీఓలు ఎంఆర్ఐలు గ్రామాల్లో పర్యటించి భూసమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. ఎవరి ప్రలోభాలకు లొంగకూడదని చట్టబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామానుజాచారి, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎంఆర్ఐలు వంశీకృష్ణ, మున్వర్, సిబ్బంది యాకయ్య, జీపీఓలు పలువురు పాల్గొన్నారు.

డిగ్రీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

జనగామ: జిల్లా కేంద్రంలోని ఏబీవీ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల 2005–2008 బీఎస్సీ(బీజెడ్‌సీ)పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. మంగళవారం పట్టణంలోని ఓ బాంక్వెట్ హాల్‌లో 17 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత జరుపుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం మధుర జ్ఞాపకాలను మిగిల్చింది. ఆనాటి కళాశాల జ్ఞాపకాలను గుర్తుకుచేసుకున్నారు. కార్యక్రమంలో మీసాల కుమారస్వామి, పాము సుదర్శన్, నాగరాజు, రమ్య, స్వప్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్పాదకతకు ఊతం

పీఎం ధన్‌ధాన్య కృషి యోజన పథకానికి జనగామ ఎంపిక

- పంటల వైవిధ్యీకరణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులకు ప్రోత్సాహం
- నీటిపారుదల, మౌలిక సదుపాయాల మెరుగు
- స్వల్పకాలిక, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యం



జనగామ రూరల్: వ్యవసాయ ఉత్పాదకత పెంచి ఆర్థిక ఎదుగుదలకు కేంద్ర ప్రభుత్వం మరింత భరోసా కల్పించేందుకు ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన పథకం ఉపయోగపడనుంది. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, పంటల వైవిధ్యీకరణ, మెరుగైన నీటిపారుదల, రుణాల సులభతరం లక్ష్యంగా ఈ పథకం వ్యవసాయ రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద దేశ వ్యాప్తంగా 100 జిల్లాలను గుర్తించగా ఇందులో తెలంగాణ నుంచి ఎంపికైన 4 జిల్లాల్లో జనగామ జిల్లాకు చోటు లభించింది. ఎంపికై న జిల్లాల్లో రూ.960 కోట్ల వార్షిక వ్యయంతో ఆరేళ్లపాటు ఈ పథకం అమలుకానుంది. వ్యవసాయ ఉత్పాదకత, పంటల మార్పిడి, నీటిపారుదల, నిల్వ, ఉత్పత్తుల విలువ పెంచే విధంగా ప్రాసెసింగ్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల వ్యవసాయ రంగం అభివృద్ధి చెందనుంది.

పథకం అమలు విధానం

జిల్లాల్లో ఉత్పాదకత, మౌలిక సదుపాయాలు రైతులు ఆదాయాన్ని పెంచడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈపథకం అమలవుతోంది. 36 కేంద్ర, రాష్ట్ర పథకాల సమన్వయం చేస్తూ ఈ పథకం కింద 11 మంత్రిత్వ శాఖలు, విభాగాల కింద అమలుకానున్నాయి. ముఖ్యంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన, వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి, మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్, మిషన్ ఆన్, ఆయిల్ పామ్, హార్టికల్చర్ మిషన్, కృషి యోజన ఉన్నాయి. జిల్లా స్థాయి కమిటీలు, రాష్ట్ర స్థాయి స్టీరింగ్ గ్రూపులు, జాతీయ స్థాయి పర్యవేక్షణ సంస్థలతో ఈ పథకం మూడు అంచెల ద్వారా అమలవుతోంది. జిల్లా స్థాయిలో, కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ధన్‌ధాన్య కృషి సమితి ఏర్పాటు కానుంది.

సమగ్ర వ్యవసాయమే లక్ష్యం



ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన పథకం కింద జనగామ జిల్లా ఎంపికైంది. వ్యవసాయంలో అత్యంత నిరంతర నిర్మాణాత్మక సవాళ్లను పరిష్కరిస్తూ ఉత్పాదకతను పెంచడానికి, స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడానికి, జీవనోపాధిని మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది.

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

పథకం లక్ష్యాలు..

- వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం
- సుస్థిర వ్యవసాయ పద్ధతులను విస్తరించడం
- పంచాయతీ, బ్లాక్ స్థాయిలో పంట కోత అనంతరం నిల్వ సదుపాయాలను బలోపేతం చేయడం
- మైక్రోఇరిగేషన్ వంటి నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం
- తక్కువ వడ్డీతో దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యవసాయ రుణాలను సులభతరం చేయడం.

ప్రణాళికలు ఇలా..

జిల్లాస్థాయిలో బేస్ లైన్ సర్వే నిర్వహించి ఉత్పాదకత లోపాలు, నీటి వనరులు, మార్కెట్ మౌలిక సదుపాయాలు, కోల్డ్ స్టోరేజ్, రుణాల పరిస్థితి మొదలైన అంశాలను విశ్లేషణ చేసి వాటి ఆధారంగా 5 సంవత్సరాల ఫలితాల ఆధారిత కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తారు. క్షేత్రస్థాయి పర్యవేక్షణను బలోపేతం చేయడానికి, ప్రతి జిల్లాకు కేంద్ర నోడల్ అధికారులను నియమిస్తారు. పురోగతిని పర్యవేక్షించడం, స్థానిక బృందాలతో సమన్వయం చేసుకోనున్నారు. అన్ని కన్వర్జింగ్ పథకాల సమన్వయ అమలుకు మార్గనిర్దేశం చేస్తూ జిల్లా పురోగతిని కేంద్ర పర్యవేక్షణ పనితీరు సూచికలు ఉపయోగించి ట్రాక్ చేస్తూ పనితీరును అంచనా వేయడానికి, అంతరాలను గుర్తించి జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడానికి నెలవారీగా సమీక్షిస్తారు. ఈ పథకం పంటల వ్యవసాయం మాత్రమే కాకుండా పండ్లు, మత్స్య సంపద, తేనెటీగల పెంపకం, పశుసంవర్ధకం, వ్యవసాయ అటవీ రంగాలపై దృష్టి పెడుతుంది. స్కిల్, టెక్నాలజీ, సంస్థాగత బలాన్ని పెంచడం ద్వారా ఈ పథకం గ్రామీణ ఉత్పాదకతలో విశేషమైన మార్పు తీసుకరానుంది.

ఆన్‌లైన్‌ను పునరుద్ధరించాలి

న్యూశాయంపేట: మైనార్టీ పథకాల దరఖాస్తు కోసం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించే వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలని మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ యాకూబ్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మైనార్టీల కోసం రెండు కొత్త పథకాలను ప్రభుత్వం తీసుకొచ్చిందని పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 6 గడువు ఉన్నా సోమవారం నుంచే ఎలాంటి సమాచారం లేకుండా వెబ్‌సైట్‌ను నిలిపేశారన్నారు. ఈ అంశాన్ని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్ దృష్టికి తీసుకెళ్లగా.. ఎన్నికల కోడ్ కారణంగా సైట్ తాత్కాలికంగా ఆగిపోయిందని తెలిపారన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే ఈ పథకం ప్రారంభమైనందున సైట్‌ను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

పాకాలలో పర్యాటకుల సందడి



మత్తడి వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

ఖానాపురం: ఖానాపురం మండలంలోని పాకాలలో పర్యాటకుల సందడి నెలకొంది. పండుగ సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చి పాకాల మత్తడి వద్ద సందడి చేశారు. బోటింగ్ చేయడంతో పాటు లీకేజీ నీటిలో జలకాలాడుతూ ఉత్సాహంగా గడిపారు. దీంతో పాకాలలో సందడి నెలకొంది.

పరవళ్లు తొక్కుతున్న పాకాల

ధాన్యాగార ప్రాంతానికి ప్రధాన నీటి వనరు పాకాల. ఈ సరస్సు ఆగస్టు 15వ తేదీ నుంచి నేటి వరకు మత్తడి పోస్తోంది. సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు కాగా పూర్తిస్థాయిలో నిండుకొని 47 రోజులుగా మత్తడి పోస్తుంది. కురుస్తున్న వర్షాలతో సరస్సులో నిండుకుండలా ఉండటంతో మత్తడి పరవళ్లు కొనసాగుతోంది.

గోదావరి వరదతో మునిగిన మిర్చి పంటలు

- 20 ఎకరాల్లో నష్టం..
- లబోదిబోమంటున్న రైతులు


వరదలో మునిగిన మిర్చి మొక్కలు

ఏటూరునాగారం: గోదావరి రెండు రోజులుగా ఉగ్ర రూపం దాల్చుతోంది. మండలంలోని రామన్నగూడెం వద్ద వరద రెండో ప్రమాద హెచ్చరికకు చేరింది. దీంతో ఏటూరునాగారంలోని మానసపల్లి, ఒడవాడ శివారు ప్రాంతాల్లోని మిర్చి పంటలు వరదతో మునిగాయి. మొక్కలు వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. అంతేకాకుండా వరద రెండు రోజుల నుంచి నిలిచి ఉండడంతో మిర్చి నారు కుళ్లి మొక్క చనిపోయే ప్రమాదం ఉందని రైతులు లబో దిబోమంటున్నారు. కందకట్ల రమేశ్, గండెపల్లి ఈశ్వరయ్య, గంప శ్రీను, వంగరి రామయ్య, పడాల మల్లికార్జున్, సాయిరి అశోక్, ఐయినాల రాములు, నామని సాంబశివరావుకు చెందిన సుమారు 20 ఎకరాల్లో మిర్చితోట మొత్తం మునిగింది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పంటలు సాగు చేస్తుంటే వరద నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి పరిహారం ఇప్పించాలని బాధితులు వేడుకుంటున్నారు.

గోదావరి కాస్త తగ్గుముఖం


కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్లను తాకుతూ ప్రవహిస్తున్న గోదావరి వరద

కాళేశ్వరం: ఎగువన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాళేశ్వరం వద్ద గోదావరికి వరద ఉధృతి కొనసాగుతోంది. మంగళవారం మహదేవపూర్ మండలం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 12 మీటర్ల ఎత్తులో నీటిమట్టం పుష్కరఘాట్లను తాకుతూ ప్రవహించింది. దిగువన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి 10.37లక్షల క్యూసెక్కుల వరద చేరింది. దీంతో బ్యారేజీలోని మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. కాగా, సోమవారం 13.290 మీటర్లకు వరద నీటిమట్టం చేరగా మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ వద్ద 11.37లక్షల క్యూసెక్కులు తరలిపోయాయి. కాగా, సాయంత్రం వరద ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టింది.

ఆహారం.. ఆరోగ్యం

సంప్రదాయ వంటలతోనే ఆరోగ్యం పదిలం

- పాశ్చాత్య అలవాట్లతో శరీరానికి నష్టం
- ఆకుకూరలు అన్నింటికీ ప్రయోజనం
- సేంద్రియ పంటలైతే మరీ మంచిది

ఖిలా వరంగల్ : ఆధునిక జీవన శైలిలో ఆహారపు అలవాట్లలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సహజ సిద్ధంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు తదితర ఆహార పదార్థాలను తగ్గించి పాశ్చాత్య ఆహారపు అలవాట్లను అలవర్చుకుంటున్నారు. ఫలితంగా కడుపు నిండుతున్నా శరీరానికి మాత్రం నష్టం జరిగి యుక్త వయసులోనే వ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత సమస్య అధికంగా ఉంటోంది. ఇందుకు కారణం తీసుకునే ఆహారమేనని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కుటుంబీకులు ఆరోగ్యంగా ఉంటేనే ఆ ఇంట్లో ఆనందం వెల్లివిరుస్తుంది. ఈ క్రమంలో ప్రస్తుత రోజుల్లో మానవుడు ఆరోగ్యంగా ఉండానికి తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు ఏమిటో వైద్య నిపుణులు తెలుపుతున్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

ఆకుకూరలు తప్పనిసరి



రోజు వారీ తీసుకునే ఆహారంలో తప్పనిసరిగా సహజ సిద్ధమైన ఆకుకూరలు, కూరగాయలతోపాటు పప్పుదినుసులు ఉండేలా తీసుకోవాలి. సజ్జలు, రాగులు, జొన్నలు, తోటకూర ఎక్కువ తీసుకోకపోవడం వల్ల గర్భిణులు, బాలింతలు అధిక శాతం మందులు వాడాల్సి వస్తుంది. గుడ్లు, పాలు రోజూ పరిమితంగా తీసుకోవాలి. పండ్ల రసాలు, కొబ్బరి నీరు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారు.

-అచ్చ వరుణ్, జనరల్ సర్జన్, వరంగల్

రక్తపోటు నివారణకు అరటి..


అరటి పండ్లు

గర్భిణులు, వృద్ధుల్లో అధిక రక్తపోటును నివారించేందుకు అరటి పండు దివ్య ఔషధం. సోడియం శాతాన్ని తగ్గించి శరీరం, రక్తాని ఉత్తేజ పరుస్తుంది. ఫలితంగా రక్తపోటు తగ్గుతుంది. పొటాషియం ఎక్కువ ఉండడంతో రక్తకణాలు శుభ్రపడి రక్తం సాఫీగా శరీర భాగాలకు సరఫరా అవుతుంది.

ఆకుకూరలు.. ఆరోగ్య ప్రదాతలు


పాలకూర

ఆకుకూరలు సహజ సిద్ధంగా తాజాగా ఉంటాయి. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగుపడుతుంది. విటమిన్ 'ఏ' పుష్కలంగా లభించే ఆకుకూరలతో కంటి సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. తోటకూర, గోంగూర, పాలకూర, మెంతికూర, పొన్నకూర, బచ్చలికూర, మునిగాకుతో మానవ శరీరానికి, మెదడుకు అవసరమైన ఎన్నో పోషకాలు లభిస్తాయి. వీటిని పప్పు దినసులలో కలిపి తీసుకోవడం వల్ల ఐరన్ అధికంగా పొందడంతోపాటు మంచి ప్రొటీన్లు అందుతాయి. ఫలితంగా గర్భిణుల్లో రక్తహీనత నివారించొచ్చు.

కోడిగుడ్డు..


నాటుకోడిగుడ్లు

కోడిగుడ్లలో ఉండే ప్రొటీన్, విటమిన్లతోపాటు కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ ఆరోగ్యానికి ఉపకరిస్తాయి. గుడ్లను ఆహారంలో తీసుకుంటే చిన్నారులకు మానసిక, శారీరక పెరుగుదల బాగుంటుంది. గర్భిణులు , బాలింతలు, వ్యాధిగ్రస్తులకు కోడిగుడ్లు ఎంతో మేలు చేస్తాయి. బ్రాయిలర్ గుడ్లలో రసాయన అవశేషాలు కనిపిస్తున్నాయి. నాటు కోడిగుడ్డు తినడం మంచిది.

రాగులు..



రాగిపిండితో చేసిన వివిధ పదార్థాలు తినడం ద్వారా కాల్షియాన్ని పెంచుకోవచ్చు. విటమిన్ సీ, డీ, ఐరన్ ఎక్కువ లభిస్తాయి. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. బలవర్ధకంగా ఉండడంతోపాటు మలబద్ధకాన్ని నివారించుకోవచ్చు. గ్రామాల్లో సహజ సిద్ధంగా లభించే ఆహారం తీసుకునే వారిలో కంటే మారుతున్న ఆహారపు అలవాట్ల స్వీకరిస్తున్న నగర, పట్టణ ప్రాంతాల ప్రజల్లో వ్యాధులు అధికంగా కనిపిస్తున్నాయి. అందుకే రాగి పిండిని విరివిగా తీసుకోవడం మంచిది.

మొలకలు గుండెకు మేలు..


పెసర్లతో తయారు చేసిన మొలకలు

మొలకలు కొద్దిగా తిన్నా కడుపు నిండుతుంది. కేలరీలు పెరగవు. శరీర బరువును తగ్గించుకోవాలనుకునే వారికి ఇది మంచి ఆహారం. మొలకల్లో ఏ, సీ, బీ విటమిన్లు ఉంటాయి. అలాగే, ఐరన్, పాస్పరస్, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియంతోపాటు పీచు పదార్థం పాలేట్, కొవ్వు అమ్లాలు కూడా ఉంటాయి. వీటి వల్ల గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉండడమే కాకుండా జీర్ణశక్తిని అదుపులో ఉంచి శరీర బరువు పెరగకుండా నియంత్రిస్తాయి. అలానే, జుట్టు పెరిగేందుకు ఆస్కారం ఉంటుంది.

ఇంటి పంటతో ఆరోగ్యం ..


సేంద్రియ పద్ధతిలో ఇంటి వద్ద పందిరి బీరకాయ

ప్రతీ ఇంటి ఆవరణ కూరగాయలు, ఆకుకూరతోటలు కావాల్సి ఉంది. వాటిని పండిస్తే స్వచ్ఛమైన ఆకు, కూరగాయలు తిని ఆరోగ్యంగా ఉంటారు. ఇంటి ఆవరణలో స్థలాలు లేకపోయినా ప్రత్యామ్నాయ పద్ధతులు అవలంబిస్తూ తమకు ఇష్టమైన కూరగాయలు పండించడంలో కొందరు ఆదర్శంగా నిలుస్తూ ఆరోగ్యవంత జీవనాన్ని అందుకుంటున్నారు.

ఘన్‌పూర్ అభివృద్ధికి రూ.50 కోట్లు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈఏడాది జనవరిలో స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా చేశామని, సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు తీసుకొచ్చానన్నారు. మున్సిపాలిటీ కార్యాలయ భవనం, టౌన్ హాల్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, రోడ్డు వెడల్పు, తదితర పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. సదరు పనులన్నింటినీ ఏడాది లోపు పూర్తి చేస్తానని, వీటితో పాటు వంద పడకల ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ డివిజనల్ ఆఫీస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల తదితర పనులు పూర్తయితే స్టేషన్ ఘన్‌పూర్ రూపురేఖలు మారుతాయన్నారు. అలాగే, దేవాదుల మూడో దశ పనులకు రూ.1,001 కోట్లు కోట్లు మంజూరు చేశారని తెలిపారు. బీసీల రిజర్వేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి దేశంలో ఏ ప్రభుత్వం చేయలేని సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపినా స్పందన లేదని, బీసీలపై ప్రేమ వల్లించే పార్టీలు బీసీ రిజర్వేషన్‌కు మద్దతు తెలపాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీశ్‌రెడ్డి, గ్రంథలయ సంస్థ జిల్లా చైర్మన్ మారుజోజు రాంబాబు, మార్కెట్ వైస్ చైర్మన్ ఐలయ్య, చిల్పూరు దేవస్థాన చైర్మన్ శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'రైల్ ఓవర్ రైల్' ప్రాజెక్టుకు ఆమోదం

డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలో 10.5 కిలోమీటర్ల నిర్మాణం

డోర్నకల్: డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలో నిర్మించనున్న 'రైల్ ఓవర్ రైల్' ప్రాజెక్టుకు మంగళవారం రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదముద్ర వేసింది. డోర్నకల్ రైల్వే జంక్షన్ పరిధిలో 10.5 కిలోమీటర్ల మేర చేపట్టనున్న 'రైల్ ఓవర్ రైల్' ప్రాజెక్ట్ ప్రతిపాదనకు కేంద్ర రైల్వేశాఖ ఆమోదించింది. ప్రాజెక్టుకు సుమారు రూ. 320 కోట్ల ఖర్చు కానుంది. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే విజయవాడ-కాజీపేట మార్గంతోపాటు డోర్నకల్-భద్రాచలం రోడ్ మార్గంలోనూ రైళ్ల రాకపోకలు వేగవంతమయ్యే అవకాశాలు ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే విజయవాడ-కాజీపేట రైలు మార్గంలో ప్రస్తుతం మూడో లైన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మార్గంలో నాలుగో లైన్ ఏర్పాటు ప్రతిపాదనలు కూడా పురోగతిలో ఉన్నాయి. భద్రాచలం రోడ్ నుంచి విజయవాడకు వచ్చి పోయే రైళ్ల రద్దీ కారణంతో బైపాస్‌లో నిలుస్తున్నాయి. ప్రస్తుతం ఆమోదించిన 10.5 కిలోమీటర్ల మేర రైల్ ఓవర్ రైల్ ప్రాజెక్ట్ పూర్తయితే బైపాస్‌లో రైళ్ల సజావుగా సాగడమే కాకుండా ఈ మార్గంలో బొగ్గు రవాణా వేగవంతం కావడంతోపాటు కొత్త రైళ్లను ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి: హసన్‌పర్తి సంస్కృతీవిహార్‌లోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు వివిధ అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ రవి ఒక ప్రకటనలో తెలిపారు. సెల్ రిపేరింగ్(30రోజులు), హౌజ్ వైరింగ్ (30రోజులు), ఏసీ రిఫ్రిజిరేటర్ (30రోజులు) ఎల్ఎంవీ డ్రైవింగ్ (30రోజులు)ల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువకులు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. 18 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు ఉండి, తెల్లరేషన్‌కార్డు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డులతో పాటు విద్యార్హత ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలకు ఈనెల 5వ తేదీలో సంస్కృతీ విహార్, హసన్‌పర్తిలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. వివరాలకు ఫోన్ నంబర్ 97040 56522కు సంప్రదించాలని సంస్థ డైరెక్టర్ రవి తెలిపారు.

అధిక వడ్డీ ఆశచూపి మోసం..

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు


వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

మహబూబాబాద్ రూరల్ : ఓ ప్రైవేట్ సంస్థలో డబ్బులు పెట్టుబడి పెడితే అధిక డబ్బులు వస్తాయని ఓ వ్యక్తి నమ్మించగా పలువురు ఆ సంస్థలో పెట్టుబడిపెట్టారు. ఏడాది కావొస్తున్న నిర్వాహకుడు పెట్టుబడి డబ్బులు ఇవ్వకుండా కాలం వెల్లదీయడంతోపాటు చంపుతానని బెదిరిస్తున్నాడు. దీంతో పలువురు బాధితులు లబోదిబోమంటూ తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి బాధితులు భావనారుషి మౌనిక, అలేఖ్య, సుజాత కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పత్తిపాక ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బత్తుల రవికిరణ్ 'అమ్మానాన్న ట్రస్ట్' పేరిట కార్యాలయం ఏర్పాటు చేశాడు. సదరు వ్యక్తి తన సంస్థలో పెట్టుబడిపెడితే డబ్బులు అధికంగా వస్తాయని నమ్మించాడు. దీనిని నమ్మిన పలువురు మొత్తం సుమారు రూ.12 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే పెట్టుబడిపెట్టి ఏడాది కావొస్తున్నా డబ్బులు ఇవ్వమని అడిగితే సదరు సంస్థ నిర్వాహకుడు మాయమాటలు చెప్పి కాలం వెళ్లదీస్తూ మోసం చేస్తున్నాడు. బంగారం తాకట్టుపెట్టి మరి డబ్బులు తీసుకొచ్చి ఆ సంస్థలో పెట్టుబడి పెట్టామని, తమ డబ్బులు ఇవాలని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నాడని బాధితులు పేర్కొన్నారు. దీనిపై తమకు న్యాయం చేయాలని కోరుతూ మహబూబాబాద్ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. కాగా, ఈ ఘటనపై టౌన్ సీఐ మహేందర్ రెడ్డిని వివరణ కోరగా బాధిత మహిళలు ఫిర్యాదు చేశారని, దర్యాప్తు చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే, 'అమ్మానాన్న ట్రస్ట్' నిర్వాహకుడు బత్తుల రవికిరణ్‌ను వివరణ కోరగా తాను ఎవరిని మోసం చేయలేదని, మహిళల ఆరోపణలు అవాస్తవమన్నారు.

వివాహిత ఆత్మహత్య


అశ్విని (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. శివునిపల్లికి చెందిన అర్చకుడు తొరివి మోహన్‌శర్మ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య అశ్విని(40), ఒక కుమారుడు ఉన్నారు. రోజు మాదిరిగానే మంగళవారం గుడిలో పూజలు ముగించుకుని ఇంటికెళ్లగా అశ్విని బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉంది. గమనించిన మోహన్‌శర్మ కేకలు వేస్తూ ఆమెను కిందికి దింపి చుట్టుపక్కల వారిని పిలువగా అప్పటికే మృతిచెంది ఉంది. ఈ విషయంపై సమాచారం అందుకున్న ఎస్సై వినయ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అశ్విని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతురాలి తరఫున నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మద్యంమత్తులో భార్యను హతమార్చిన భర్త

- తిర్మలాపూర్‌లో విషాదం..


ప్రమీల (ఫైల్)

చిట్యాల: మద్యం మత్తులో భర్త తన భార్యను రోకలిబండతో హతమార్చాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం తిర్మలాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కనుకుంట్ల లింగయ్య, ప్రమీల(50) దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో కొంత మేర ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో దంపతులకు నిత్యం గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మద్యం తాగిన లింగయ్య.. మరోసారి తాగడానికి డబ్బులు ఇవ్వాలని తన భార్య ప్రమీలతో గొడవ పెట్టుకున్నాడు. ఆమె లేవని బదులివ్వడంతో కోపోద్రిక్తుడైన లింగయ్య.. ప్రమీల తలపై రోకలి బండతో బాదడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై సమాచారం అందుకున్న సీఐ మల్లేశ్, ఎస్సై శ్రవణ్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతురాలి చిన్న కుమారుడు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పంటకు ప్రమాదకారి..

తెల్లదోమ.. మిర్చి పంటకు ప్రధాన శత్రువు

- ఆకుల రసాన్ని పీల్చి మొక్కలను బలహీనం చేస్తుంది
- పంటలో నియంత్రణ చర్యలు చేపట్టాలి
- నాటిన తర్వాత జాగ్రత్తలు తీసుకోవాలి
- రైతులకు శాస్త్రవేత్త ఎ.ప్రశాంత్ కుమార్ సలహాలు



ప్రశాంత్ కుమార్

మహబూబాబాద్ రూరల్ : తెల్లదోమ మిర్చి పంటకు ప్రధాన శత్రువు. ఇది ఆకుల రసాన్ని పీల్చి మొక్కలను బలహీనపరుస్తుంది. అంతేకాకుండా చిల్లి లీఫ్ కర్ల్ వైరస్ వ్యాధిని వ్యాప్తి చేస్తుంది. ఈ నేపథ్యంలో ఈ పంటలో తెల్లదోమ నియంత్రణ చర్యలు, నాటిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రతలపై మహబూబాబాద్ మండలం మల్యాల గ్రామంలోని జెన్నారెడ్డి వెంకటరెడ్డి ఉద్యాన పరిశోధన స్థానం ప్లాంట్ పాథాలజీ శాస్త్రవేత్త ఎ.ప్రశాంత్ కుమార్.. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

30 నుంచి 40 రోజులు అత్యంత కీలకం..

మిర్చి పంటను నాటిన తర్వాత మొదటి 30 నుంచి 40 రోజులు అత్యంత కీలకం. ఈ సమయంలో తెల్లదోమల సంఖ్య పెరిగితే వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుంది. అందుకే రైతులు పొలంలో నాటిన మొదటి రోజునుంచే పర్యవేక్షణ, నియంత్రణ చర్యలు చేపట్టాలి.


మిర్చి పంటను ఆశించే తెల్లదోమ


తెల్లదోమ ఆశించి వడలిపోతున్న మొక్క

ప్రారంభ వృద్ధి దశ (10 నుంచి 30 రోజులు) : నీమాయిల్ 1500 పీపీఎం 5 మిల్లీ లీటర్లను లీటర్ నీటిలో పిచికారీ చేయాలి. వర్టిసిలియం లెకానీ/ బ్యావేరియా బాసియానా 5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి స్ప్రే చేయాలి. ట్రాప్ క్లోఫ్స్ పై తెల్లదోమలు చేరితే అక్కడే ప్రత్యేకంగా స్ప్రే చేయాలి.

మధ్య వృద్ధి దశ (30 నుంచి 50 రోజులు) : పొలాన్ని ప్రతీ 3 నుంచి 4 రోజులకు పర్యవేక్షించాలి. తెల్లదోమల సంఖ్య పెరిగితే మారుస్తూ వాడాలి. ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్ఎల్ 0.3 మిల్లీ లీటర్లను లీటర్ నీటికి కలిపి స్ప్రే చేయాలి. లేదా థియామెథాక్సామ్ 25 డబ్ల్యూజీ 0.25 గ్రాములను లీటర్ నీటితో స్ప్రే చేయాలి. ఒకే ఔషధాన్ని పునరావృతం చేయకుండా మారుస్తూ వాడాలి.

నియంత్రణ కొనసాగించాలి (50 రోజులుపైగా) : తెల్ల దోమల నివారణకు ఎర పంటలపై దృష్టి పెట్టి నియంత్రణ కొనసాగించాలి. వర్షాభావం / పొడి గాలి సమయంలో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి. రసాయనాలను అవసరమైతే మాత్రమే వాడాలి.

దశ/విధానం.. నియంత్రణ చర్యలు

పర్యావరణం, పొలం నిర్వహణ : ఉష్ణోగ్రత 25 నుంచి 35 డిగ్రీల సెల్సియస్, తేమ 60 నుంచి 80 శాతం ఉన్నప్పుడు తెల్లదోమలు ఎక్కువ పెరుగుతాయి. ఈ సమయంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి. గాలి ప్రసరణకు అనుకూలంగా మొక్కల మధ్య దూరం పెట్టాలి. పొలంలో నీరు నిల్వ లేకుండా చూడాలి. నాటిన వెంటనే (0 నుంచి 10 రోజులు) ఎకరానికి 10 నుంచి 12 పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేయాలి. పొలంలో కలుపు మొక్కలను తొలగించాలి. పత్తి, పొద్దు తిరుగుడు, ఆముదం మొక్కలను పొలం అంచుల్లో నాటాలి.

గొర్రెలను తప్పించబోయి లారీ బోల్తా

- అదుపు తప్పి బైక్‌ను ఢీకొనడంతో హెడ్ కానిస్టేబుల్ మృతి
- మరొకరికి తీవ్రగాయాలు


రవీందర్(ఫైల్)

పరకాల : మండలంలోని కామారెడ్డిపల్లి వద్ద గొర్రెల మందను తప్పించబోయి కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి హెడ్ కానిస్టేబుల్ ద్విచక్రవాహనంతో పాటు గొర్రెల కాపరిని ఢీకొంది. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలపాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ ఆకుల రవీందర్ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మాందారిపేట నుంచి పరకాల వైపునకు కంకర లోడ్‌తో లారీ వేగంగా వస్తోంది. ఈ క్రమంలో లారీ డ్రైవర్ గొర్రెల మందను తప్పించే క్రమంలో పరకాల పోలీస్‌స్టేషన్‌లో విధులు ముగించుకొని స్వగ్రామం పత్తిపాకకు బైక్‌పై వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ ఆకుల రవీందర్‌ను ఢీకొట్టాడు. అంతటితో ఆగకుండా గొర్రెల కాపరి పాలకుర్తి సాంబయ్యను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ విషయం తెలియగానే స్థానికులు 108కు సమాచారం అందజేసి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. సాయంత్రం వరకు తమతో విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పోలీసు అధికారులు, ఉద్యోగులు ఒక్కసారిగా విషాదంలో మునిగారు. గొర్రెల కాపరి సాంబయ్య వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఈ ఘటనపై పరకాల పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

- గణపురంలో ఘటన


రమేశ్(ఫైల్)

గణపురం: చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు చెరువులో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గణపురం గ్రామానికి చెందిన దొంత రమేశ్ (32) తన స్నేహితుడితో కలిసి గణపసముద్రం చెరువులో చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి ఊపిరాడక చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రేఖ అశోక్ తెలిపారు. ఈ ఘటనతో గణపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.